క్లుప్తంగా

డీపీఓ సందర్శన



వేలేరు : మండలంలోని షోడాషపల్లి, లోక్యా తండా, వేలేరు గ్రామాలను డీపీఓ రమాకాంత్ శుక్రవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లోని వీధులను పరిశీలించి పారిశుద్ధ్య పనులు, దోమల నివారణకు చేపడుతున్న చర్యలను పంచాయితీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు గ్రామాల్లో చెత్తను సేకరించాలని, రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. వివిధ కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. అలాగే గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత శాఖ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ భాస్కర్, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన పొట్టకారి వికాస్ జులై 29వ తేదిన అదృశ్యమైనట్లు ఎస్సై జక్కుల పరమేశ్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పొట్టకారి వికాస్ జులై 9న ఉద్యోగరీత్యా బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిసినవారు 8712685227, 8712685018 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై పేర్కొన్నారు.

చౌళ్లపల్లిలో వివాహిత..

ఆత్మకూరు : వివాహిత అదృశ్యమైన సంఘటన మండలంలోని చౌళ్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన పెంబర్తి శ్రీజ భర్తతో గొడవ జరిగింది. ఈ క్రమంలో జూలై 22వ తేదీన ఆమె తల్లిగారి ఊరైన చౌళ్లపల్లికి వెళ్లింది. ఈ క్రమంలో జూలై 24 మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. స్నేహితులు, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో శుక్రవారం శ్రీజ అన్న రోహిత్ ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ సంతోశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీజ ఇంట్లో నుంచి వెళ్లేముందు గులాబీ రంగు టాప్, తెలుపు రంగు లెగ్గిన్ ధరించినట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



ఏపీఎంకు మొక్క అందజేస్తున్న సిబ్బంది

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల మహిళా సమాఖ్య ఏపీఎం (అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్)గా వీర్ల వేణు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా భరతమాత మండల సమాఖ్య సభ్యులు, సిబ్బంది ఏపీఎంకు పూలమొక్క అందించి స్వాగతం పలికారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ధర్మసాగర్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఎన్పీడీసీఎల్ ఏఈ జ్యోతిర్మయినాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్ మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా ఆ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ

పీహెచ్సీ వైద్యాధికారి అరుణ్ చంద్ర

నర్సంపేట రూరల్ : శుభ్రత పాటించడం ద్వారానే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోగలమని భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) వైద్యాధికారి అరుణ్ చంద్ర స్పష్టం చేశారు. నర్సంపేట శివారులోని సర్వాపురం ఎస్టీ హాస్టల్లో పీహెచ్సీ ఆధ్వర్యంలో శుక్రవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జ్వరాల బారిన పడిన పలువురి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వైద్యాధికారి మాట్లాడారు. భోజనం చేసేందుకు ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, వేడిగా ఉన్నప్పుడే ఆహారాన్ని భుజించాలని, హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. నీటి నిల్వలుంటే దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. జ్వరం, అనారోగ్య సమస్యలు తలెత్తితే సత్వరమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ షేక్ అలీ, సర్వాపురం సబ్ సెంటర్ ఏఎన్ఎంలు శ్యామల, కమలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

దోమల దండయాత్ర



మండల కేంద్రంలో రోడ్డుపై నిలిచిన వరదనీరు

- మూలకు పడిన ఫాగింగ్ యంత్రాలు
- వ్యాధుల బారిన పడుతున్న స్థానికులు
- రోడ్డుపై నిలుస్తున్న వరదనీరు
- పట్టించుకోని అధికారులు

నడికూడ : వర్షాల కారణంగా రోడ్లు, ఇళ్ల నడుమ వరద నీరు నిలుస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి పెరిగిపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

నో..ఫాగింగ్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో దోమల నివారణకు రూ.25 వేల నుంచి రూ.28 వేలు వెచ్చించి ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశారు. గతేడాది నుంచి ఫాగింగ్ యంత్రాలు పంచాయతీ కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉంటున్నాయని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ మండల పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పలు గ్రామాల్లోని ప్రజలు జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్నారని, కంఠాత్మకూర్లో డెంగీ కేసులు నమోదు అవడం స్థానికులను మరింత భయాందోళనకు గురిచేస్తుందని పలువురు తెలుపుతున్నారు. అయితే అధికారులు మాత్రం దోమల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహిస్తున్నారు. మండల కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పలు చోట్ల మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. వ్యాధుల బారి నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కంఠాత్మకూరులో ఫాగింగ్ యంత్రానికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



చర్యలు చేపట్టాలి



దోమల నియంత్రణకు గతంలో గ్రామపంచాయతీ అధికారులు ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. కానీ కొన్నిరోజుల నుంచి ఫాగింగ్ చేయడం మనేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలి.

– దోమ పవన్, ముస్త్యాలపల్లి

విద్యతోనే బంగారు భవిష్యత్

- ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరామిరెడ్డి



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరామిరెడ్డి

శాయంపేట : విద్యతోనే బంగారు భవిష్యత్ నిర్మాణమవుతుందని, ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ బైరి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దకోడెపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మైలారం గోవిందాపూర్, జోగంపల్లి, కామారెడ్డిపల్లి గ్రామాల నుంచి పాఠశాలకు వస్తున్న 10మంది విద్యార్థులకు ఆయన సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాలోతు సారయ్యనాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణతో చదివి ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాటు వేసేముందు జాగ్రత్తలు పాటించాలి

- పరకాల ఏడీఏ శ్రీనివాస్



వరినాట్లను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాస్

దామెర : వరినాటు వేసేసమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని పరకాల ఏడీఏ సోమరాతి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఊరుగొండలో శుక్రవారం నాటు వేస్తున్న పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. నాటు వేసేటప్పుడు నీరుపలుచగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏనుకున్న రోజు నుంచి పైరు దుబ్బుచేయడం పూర్తి అయ్యే వరకు పొలంలో 2 నుంచి 3 సెంటిమీటర్ల నీరు ఉండేలా చూడాలన్నారు. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకు 5 సెంటీ మీటర్ల నీరు ఉంచుకోవాలన్నారు. నారు కొనలను తుంచడం ద్వారా మొగి పురుగు గుడ్లను తుది దశలోనే నాశనం చేయవచ్చన్నారు. నత్రజని ఎరువులను తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు వాడటం మంచిదన్నారు. పైరుకు గాలి, వెలుతురు బాగా తాకే విధంగా చర్యలు తీసుకోవడటం మూలంగా చీడపీడల ఉధృతి తగ్గుతుందని అన్నారు. కోతకు 7 నుంచి 10 రోజుల ముందుగా నీరు తగ్గించి ఆరబెట్టాలన్నారు. ఆయన వెంట ఏఓ రాకేష్, ఏఈఓ అరుణ్, రైతులు రాజిరెడ్డి ఉన్నారు.

బిట్స్ పాఠశాలలో మాక్ పోలింగ్



ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులుదీరిన విద్యార్థులు

పరకాల : పట్టణంలోని బిట్స్ పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పిండి యుగేందర్తో పాటు ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా మాక్ పోలింగ్, ఓటింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు నామినేషన్లు దాఖలు చేయగా ఎన్నికల అధికారులు అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. అనంతరం విద్యార్థులు బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఎన్నికల ఫలితాలను ప్రకటించగా విజేతలుగా నిలిచిన ఎస్పీఎల్ సూర చాందిని, ఎఎస్పీఎల్గా తంగళ్లపల్లి యశస్వినికి ధ్రువీకరణ పత్రాలు అందజేసి ప్రిన్సిపాల్ యుగేందర్ అభినందించారు. ఓటుహక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, భవిష్యత్లో ఓటును ప్రలోభాలకు లొంగకుండా సరైనా నాయకత్వాన్ని ఎన్నుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు.

సమాజ ఉన్నతిలో ఉపాధ్యాయులు కీలకం

పర్వతగిరి : సమాజ ఉన్నతిలో ఉపాధ్యాయులు కీలకమని మండల విద్యాధికారి (ఎంఈఓ) గాయపు లింగారెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్రెడ్డి తెలిపారు. మండలంలోని ఏనుగల్ జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, తెలుగు ఉపాధ్యాయుడు అడ్డూరి రమేశ్బాబును ఉద్యోగ విరమణ సందర్భంగా జెడ్పీ హైస్కూల్ ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు అధ్యక్షతన శుక్రవారం ఘనంగా సన్మానించారు. లింగారెడ్డి, రవీందర్రెడ్డి అతిథులుగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఉపాధ్యాయుడిగా రమేశ్బాబు రెండు దశాబ్దాలకుపైగా ఎనలేని సేవలు అందించారని అభినందించారు. అనేక మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని తెలిపారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న చక్రపాణి

ధర్మసాగర్ / ఎల్కతుర్తి : తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా 2వ మహాసభలు హనుమకొండలోని ఎన్జీఓస్ భవనంలో ఈనెల 3న నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి తెలిపారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికులతో, ఎల్కతుర్తి మండల కేంద్రం, భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో జీపీ కార్మికులతో కలిసి మహాసభల వాల్పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు నష్టం చేకూర్చే మల్టీపర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేసి రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉదయం 10 గంటలకు వేయి స్తంభాల గుడి నుంచి ర్యాలీ ప్రారంభం కానుందని, జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, రాజు, సురేశ్, రంజిత్, వెంకటయ్య, రాజు, రిపిక, కృపా, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఘనంగా ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం
- ర్యాలీ నిర్వహించిన 'ఆటోవాలా'



ఎల్కతుర్తి : ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

ఎల్కతుర్తి : ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, ఓనర్లు కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి వెంబడి ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవి, రాజయ్య, భిక్షపతి, వెంకటేష్యాదవ్, రమేశ్, రాజ్కుమార్, సాంబరాజు, సంపత్, కుమార్, స్వామి, క్రాంతికుమార్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలో శుక్రవారం ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాదు నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్చేసి ఆటో డ్రైవర్లకు తినిపించారు. నాగారాజు మాట్లాడుతూ.. శాయంపేటలోని మన కాకతీయ ఆటో యూనియన్ను రిజిస్ట్రేషన్ చేపిస్తానని హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశాభావ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మన కాకతీయ ఆటో యూనియన్ అధ్యక్షుడు మారేపల్లి క్రాంతి, ఉపాధ్యక్షుడు నాగరాజు, ఆటో డ్రైవర్లు మురళి, సంతోశ్, రాజు, భద్రయ్య, సురేష్, రాజుకుమార్, రమేశ్, శ్రీకాంత్, మైనోద్దీన్ పాల్గొన్నారు.

నడికూడ : ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని శుక్రవారం మండల కేంద్రంలో కాకతీయ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు చేలిక రాజు కేక్ కట్చేసి సంబురాలు జరుపుకొన్నారు. రవి, రావుల కిషన్, రమేశ్, నవీన్, కోటి, శంకర్, పున్నం, నాగేశ్వర్రావు, రాజయ్య, మండలంలోని అన్ని గ్రామాల ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



నడికూడ : కేక్ కట్చేస్తున్న ఆటో డ్రైవర్లు



శాయంపేట : కేక్ కట్చేస్తున్న నాగరాజు

ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



కమలాపూర్ : గోలెంలోని నీళ్లు పారబోస్తున్న అధికారులు



నడికూడ : నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న అధికారులు

- మండల ప్రత్యేకాధికారి లక్ష్మణ్

కమలాపూర్ : ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మణ్ సూచించారు. మండలంలోని ఉప్పల్లో శుక్రవారం డ్రై డే సందర్భంగా పలు ఇళ్లను సందర్శించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే పాటించాలని సూచించారు. డ్రై డే రోజు గృహ పరిసరాలతో పాటు నిరుపయోగంగా ఉన్న పాత వస్తువుల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. దోమల కారణంగా డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతకు ముందు కమలాపూర్లోని కేజీబీవీని తనిఖీ చేసిన అనంతరం ఉప్పల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఎంపీడీఓ గుండె బాబు, ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, కేజీబీవీ ఎస్ఓ అర్చన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నడికూడ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ విమల సూచించారు. శుక్రవారం మండలంలోని వరికోల్ ప్రభుత్వ పాఠశాల, పులిగిల్ల ప్రాథమిక పాఠశాలలో డ్రై డే నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. చెత్త తొలగింపు, నీరు నిల్వ లేకుండా చూడాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఇంటింటికి తిరిగి పరిసరాలను పరిశీలించి, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలిపారు. ఏపీఓ విద్యావతి, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



శాయంపేటలో..

శాయంపేట : డ్రై డే సందర్భంగా మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పరిసరాలను శుభ్రం చేశారు. అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలిగించారు. అంగన్వాడీ టీచర్ శ్వేత, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' నిర్మాణాల్లో వేగం పెంచాలి



పనులను పరిశీలిస్తున్న డీఆర్డీఓ శ్రీను

ధర్మసాగర్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని డీఆర్డీఓ మేన శ్రీను అధికారులకు సూచించారు. మండలంలోని నారాయణగిరి గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారుడు అమరగొండ సాంబరాజు–మమతల ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్కుమార్, పంచాయతీ కార్యదర్శి జానపట్ల రఘు, మాజీ ఉపసర్పంచ్ పుట్ట కుమార్, బుద్దె రమేశ్, కొలను ఒగ్గు గణేశ్, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


'నిమ్స్' అధికారికి పితృవియోగం



భద్రయ్య (ఫైల్)

గీసుకొండ : హైదరాబాద్లోని నిజామ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రి లైజనింగ్ అధికారి డాక్టర్ మార్త రమేశ్కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి భద్రయ్య (78) అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామమైన ఎలుకుర్తి హవేలీలో గురువారం రాత్రి మృతి చెందారు. భద్రయ్య అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించగా పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. నిమ్స్ అధికారులు, పలువురు ప్రముఖులు అంత్యక్రియలకు హాజరై రమేశ్ను పరామర్శించారు.

ఈకేవైసీ చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఆత్మకూరు : ఈజీఎస్ వేతనదారుల ఈకేవైసీ చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15 నుంచి ఉపాధిహామీలో పనిచేసే యాక్టివ్ వేజ్సీకర్లకు ఈకేవైసీ చేసేందుకు ఆదేశాలు వచ్చాయన్నారు. ముఖ గుర్తింపు ద్వారానే రోజుకు రెండు సార్లు హాజరు పంపించడం జరుగుతుందన్నారు. రెండురోజుల్లో లక్ష్యాన్ని ఛేదించే విధంగా మొక్కలు నాటడం పూర్తి చేయాలన్నారు. ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, ఈసీ రాము, టీఏలు పాల్గొన్నారు.

అవగాహనతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట

నల్లబెల్లి : అవగాహనతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయొచ్చని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం టీమ్ లీడర్ నెల్లుట్ల సుమన్ స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో మండలంలోని మేడపల్లి, కొండాపూర్ గ్రామాల్లో కళాబృందం ఆధ్వర్యంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేలా శుక్రవారం కళాజాత నిర్వహించారు. కళాకారులు పాటలు, నాటికల రూపంలో ప్రజలను చైతన్యవంతం చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, ఇతర విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలు వైద్యుల సూచనలు, సలహాలను తూచా తప్పకుండా పాటించాలని కోరారు. కళాకారులు తాళ్ల సునీల్, పడిదం రాజేందర్, గాదె పాక బాబు, బరిగెల రవీందర్, ప్రశాంత్, భాస్కర్, నవీన్, శంకర్, గోవర్దన్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కుంకుమ పూజ

గీసుకొండ : శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని కొమ్మాలలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తులు శుక్రవారం అమ్మవారి విగ్రహానికి కుంకుమ పూజ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీనివాసాచర్యులు, అర్చకులు ఫణి, విష్ణు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

దేవాదుల నీటితో చెరువులను నింపండి

వర్ధన్నపేట : దేవాదుల నీటితో వర్ధన్నపేట, ఐనవోలు మండలాల్లోని చెరువులను నింపాలని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి దేవాదుల కెనాళ్లకు నీళ్లు విడుదల చేస్తున్నట్టు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఇటీవల ఫొటోలకు ఫోజులు ఇచ్చారని పేర్కొన్నారు. వాస్తవానికి వర్ధన్నపేట, ఐనవోలు మండలాల్లోని చెరువుల్లో నీరు లేక పంట భూములు నెర్రెలు బారాయని తెలిపారు. వెంటనే సందర్శించాలని ఎమ్మెల్యేకు సూచించారు. ఈ సంవత్సరం ఆశించిన మేరకు వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వరి నాట్లు వేసినా ఎండిపోయే దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. భూగర్భ జలాలు కనిష్ట స్థాయికి చేరుకోగా బోర్లు, బావుల్లోనూ నీళ్లు లేవని వివరించారు. రైతులకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ పర్యటనకు అడ్డుకుంటామని హెచ్చరించారు.